నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 1 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL



మాట్లాడుతున్న ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

# ఎనిమిది అంశాలతో కూడిన అజెండాపై చర్చ

ఎదులాపురం, నవంబర్ 30 : ఎనిమిది అంశాలతో కూడిన అజెండాపై చర్చించేందుకు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. అంశాలవారీగా కౌన్సిల్‌లో చర్చ చేపట్టి ఆమోదం తీసుకున్నారు. అయితే యూనియన్ బ్యాంకు సమీపంలో మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలాన్ని మహిళా శక్తి క్యాంటిన్‌కు లీజుకిచ్చే అంశాన్ని కౌన్సిలర్లు వ్యతిరేకించారు. సమగ్ర వివరాలు లేకుండా లీజుకివ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ అంశాన్ని పక్కన పెట్టారు. ఇక మున్సిపల్ పరిధిలో ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణ కోసం ఈఎస్ఎల్ సంస్థకు ఇచ్చిన కాంట్రాక్టు గడువు నేటితో ముగిసింది. కొత్త సంస్థకు నిర్వహణ బాధ్యత అప్పగించే వరకు వీధి దీపాల నిర్వహణను మున్సిపల్ యంత్రాంగమే చేపట్టనుండగా.. ఇందుకోసం రూ.25 లక్షలకు ఆమోదం తెలిపారు. వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శాంతినగర్ ఈఎల్ఎస్ఆర్ నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న జంక్షన్‌కు లాండసాంగి పంప్‌హౌజ్ లైన్‌ను అనుసంధానం చేసేందుకు రూ.42.24 లక్షలతో చేపట్టే పనులకు ఆమోదం తెలిపారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో అధికారులు నిమగ్నమై ఉన్న కారణంగా దుకాణాల వేలంపాటలో జాప్యం జరుగుతోందని, త్వరలో ఆ ప్రక్రియను పూర్తి చేసి అధిక బిడ్ దాఖలు చేసిన వారికి దుకాణాల కేటాయింపును పూర్తి చేస్తామని మున్సిపల్ చైర్మన్ తెలిపారు. కౌన్సిలర్లు అజయ్, రామేల్లి శ్రీలత, అర్చన, పవన్ కుమార్, ప్రవీణ్, వెనగంటి ప్రకాశ్, జహీర్ రంజానీ, షానావాస్, కృష్ణ పాల్గొన్నారు.

# హడలెత్తిస్తున్న పులి

## గన్నారం ఘటన నుంచి తేరుకోక ముందే మరో రైతుపై దాడి

- దుబ్బగూడ సమీపంలోని చేనులో పనిచేస్తుండగా పంజా
- గొడ్డలితో తిరగబడడంతో పారిపోయిన టైగర్
- తీవ్రంగా గాయపడ్డ సురేశ్
- మంచిర్యాలకు తరలింపు
- ముందస్తు సమాచారం ఇచ్చినా పట్టించుకోని అధికారులు

**కాగజ్‌నగర్ డివిజన్‌లో సంచరిస్తున్న పులి ప్రజలను హడలెత్తిస్తున్నది. శుక్రవారం గన్నారం సమీపంలో పత్తి ఏరుతున్న మోర్ల లక్ష్మిపై దాడి చేసి చంపగా, ఆ ఘటన నుంచి తేరుకోకముందే శనివారం సిర్పూర్-టీ మండలం దుబ్బ గూడలో రైతు సురేశ్‌పై పంజా విసిరింది. ఆ యువకుడు తన చేతిలోని గొడ్డలితో పులిపై ఎదురు దాడికి దిగడంతో అది అక్కడి నుంచి పారిపోయింది. తీవ్రంగా గాయపడ్డ రైతును కాగజ్‌నగర్‌కు తరలించి అక్కడి నుంచి మంచిర్యాలకు తీసుకెళ్లారు.**

*- కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ) /కాగజ్‌నగర్/ కౌటాల /ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్/ నవంబర్ 30 :*





కౌటాల : పులి దాడిలో గాయపడిన సురేశ్‌ను సిర్పూర్ దవాఖానకు తరలిస్తున్న స్థానికులు



కౌటాల : పులి దాడిలో గాయపడిన సురేశ్



శుక్రవారం పులిదాడిలో మృతిచెందిన మోర్ల లక్ష్మి



పులిజాడ కోసం డ్రోన్ ఎగురవేస్తున్న సిబ్బంది

### పత్తి చేనుకు వెళ్లగా..

దుబ్బగూడకు చెందిన సురేశ్, అతడి భార్య సుజాత శనివారం మధ్యాహ్నం సమీపంలోని పత్తి చేనుకు వెళ్లారు. ఇద్దరు కలిసి పత్తి తీస్తుండగా, పొదల్లో శబ్దం వినిపించింది. అడవి పందులు కావచ్చని చెదరగొట్టేందుకు సురేశ్ ఆ వైపు వెళ్లాడు. పొదల్లో రెండు పులులున్నాయని, అందులోని ఒక పులి సురేశ్‌పై దాడి చేసిందని ప్రత్యక్ష సాక్షి అయిన సుజాత ద్వారా తెలిసింది. సురేశ్‌పై పులి దాడి చేస్తున్నట్లు గమనించిన సుజాత కేకలు వేస్తూ.. అక్కడికి వెళ్లి కర్రలతో పులిని కొట్టే ప్రయత్నం చేసింది. అప్పటికే సురేశ్ మెడపై దాడి చేసిన పులి.. అతడిని కొంత దూరం లాక్కెళ్లింది. సురేశ్ కూడా గొడ్డలితో ఎదురుదాడి చేయడం.. అదే సమయంలో చుట్టు పక్క రైతులు, కూలీలు అక్కడికి రావడంతో పులి సురేశ్‌ను వదిలేసి పారిపోయింది. తీవ్రంగా గాయపడ్డ సురేశ్‌ను హుటాహుటిన సిర్పూర్-టీ దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాగజ్‌నగర్‌లోని దవాఖానకు .. అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు.

### వరుస ఘటనలతో భయాందోళనలు

కాగజ్‌నగర్ డివిజన్‌లో పులుల దాడి ఘటనలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. శుక్రవారం గన్నారంలో మోర్లె లక్ష్మిపై పులి దాడి చేసి చంపే వరకూ అటవీ అధికారులు గుర్తించలేకపోయారు. గన్నారంలో ఘటన జరిగిన తర్వాత కూడా పులి సంచారాన్ని గుర్తించడంలో అటవీ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. శనివారం ఉదయం సిర్పూర్ మండలంలోని పెద్ద బండ, దుబ్బగూడ ప్రాంతాల్లో పులిని చూసిన కొంత మంది అటవీ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారం క్రితం వరకు కెరమెరి, వాంకిడి, జైనూర్, తిర్యాణి మండలాల్లో సంచరించిన పులి పశువులపై దాడి చేసింది. వాంకిడి మండలంలోని మహారాష్ట్ర బార్డర్ హైవేపక్కన సంచరించిన పులి ఎక్కడికి వెళ్లిందో అధికారులు ఇప్పటి వరకు ట్రాక్‌చేయలేకపోయారు. రెండు రోజులుగా కాగజ్‌నగర్ డివిజన్‌లోని గన్నారం, దుబ్బగూడ ప్రాంతాల్లో తిరుగుతూ రైతులు, కూలీలపై పంజా విసురుతున్నా అధికారులు గుర్తించలేకపోతున్నారు. సంతానోత్పత్తి సీజన్ కావడంతో ఆడ పులి కోసం మగ పులులు వలస వస్తాయని అటవీ అధికారులకు తెలిసినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

### డ్రోన్ సాయంతో జల్లెడ

కాగజ్‌నగర్ కారిడార్‌లో పెద్దపులి హల్‌చల్ చేస్తున్నది. మనుషులపై దాడులు చేస్తూ కంటిమీదకునుకు లేకుండా చేస్తుంది. ఈఈ క్రమంలో అటవీ అధికారులు ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అటవీ ప్రాంతాలో 144 సెక్షన్ అమలు చేశారు. దుర్గానగర్, గన్నారం, విలేజ్ నంబర్ 6, 10, 11, 9 తదితర అటవీ ప్రాంతాల్లో శనివారం వేకువ జాము నుంచే డ్రోన్ సాయంతో అడవులను జల్లెడ పట్టారు. వైల్డ్ లైఫ్ ట్రాకర్, 40 మంది సిబ్బంది ఆరు బృందాలుగా విడిపోయి గాలింపు చర్యలు చేపడుతున్నారు. పులి ఆచూకీ లభించకపోగా సిర్పూర్ (టీ) మండల అటవీ ప్రాంతానికి పెద్ద పులి వెళినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు.

### ఎస్-10, కే-8 పులులతో పాటు కొత్తది!

కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో రెండు పులులున్నట్లు గుర్తించినప్పటికీ ఇటీవల మూడో పులి ప్రవేశించినట్లు తెలిసింది. దాడులు చేస్తున్నది కొత్తపులి కావచ్చని భావిస్తున్నారు. సిర్పూర్ (టీ)అటవీ ప్రాంతంలో ఎస్-10 ఆడ పులి సంచరిస్తున్నట్లు తెలుస్తున్నది. కాగజ్‌నగర్, సిర్పూర్.. మహారాష్ట్ర అటవీ ప్రాంతాలకు పులి రాకపోకలు సాగిస్తున్నట్లు యానిమల్స్ ట్రాకర్స్ స్పష్టం చేస్తున్నారు. ఇకా కే-10 మగ పెద్ద పులి బెజ్జూర్, పెంచికలపేట్ మండలాల అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు వారు గుర్తించారు.

### చేలల్లోనే తెల్లబంగారం

జిల్లాల్లో కూలీలు దొరకక చేలల్లోనే తెల్లబంగారం ఉండిపోతున్నది. దీనికి తోడు పులి అలజడితో కూలీలు భయపడిపోతున్నారు. గతేడాది మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చినా.. ఈసారి మహారాష్ట్రలో ఎన్నికలు ఉండడం వల్ల తక్కువ మంది వచ్చారు. ఒకవేళ పత్తి ఏరడానికి కూలీలు ముందుకొచ్చినా కిలోకు రూ. 12 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### నా కళ్ల ముందే దాడి చేసింది

ఎప్పటిలాగే ఈ రోజు పొద్దున పత్తి ఏరడానికి నా భర్త సురేశ్‌కంటే ముందే నేను వెళ్లిన. ఆ తర్వాత ఆయన ఎడ్ల బండితో వచ్చాడు. నేను ఓ దిక్కు పత్తి ఏరుతున్న. చేను వద్దకు చేరుకున్న భర్త సురేశ్‌పై నా కళ్లముందే పులి దాడి చేసింది. వెంటనే కేకలు వేసిన. నా భర్త చేతిలో ఉన్న గొడ్డలితో పులిపై దాడిచేసిండు. దీంతో పులి అడవిలోకి పారిపోయింది. వెంటనే నేను మా బంధువులకు ఫోన్ చేసి చెప్పిన. నా భర్త సురేశ్‌ను తీసుకొని కొద్ది దూరం నడిచి వెళ్లిన.. మా బంధువులు వచ్చి దవాఖానకు తీసుకెళ్లారు.

*- సురేశ్ భార్య సుజాత*



అటవీ ప్రాంతంలో పెద్దపులి కోసం గాలిస్తున్న ఫారెస్టు అధికారులు

# పెద్దపులి కోసం గాలింపు

సారంగాపూర్, నవంబర్ 30 : కౌట్ల(బి) శాంతినగర్ అటవీ పరిసర ప్రాంతంలో పెద్దపులి కోసం శనివారం ఫారెస్టు అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం ఉన్నట్లు ఫారెస్టు అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో కౌట్ల(బి), జౌళి, ధని గ్రామాల బీట్ అధికారులు స్వప్న, వెన్నెల, శ్రవంతి అట్టి ప్రదేశానికి చేరుకుని అటవీ ప్రాంతం మొత్తం గస్తీ నిర్వహించారు. ఆ ప్రదేశంలో పెద్దపులికి సంబంధించిన ఆనవాళ్లు అగుపించలేదు. అనంతరం శాంతినగర్, కౌట్ల(బి) గ్రామాల రైతులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పెద్దపులి కనిపిస్తే ఫారెస్టు అధికారులకు సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. అలాగే పెద్దపులికి ఎలాంటి హానీ తలపెట్టవన్నారు.



# రుణమాఫీ అయ్యేనా?

## ప్రభుత్వ యంత్రాంగం నుంచి రాని అధికారిక సమాచారం

ఆదిలాబాద్, నవంబర్ 30(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన రుణమాఫీ కోసం అన్నదాతలు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల్లో భాగంగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. మొదటి విడుతలో రూ.ఒక లక్ష, రెండో విడుతలో రూ. 1.50 లక్షలు, మూడో విడుతలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం చేపట్టిన రూ.2 లక్షల రుణమాఫీ అస్తవ్యస్తంగా మారింది. మూడు విడుతల్లో అర్హులైన రైతులకు రుణమాఫీ జరగలేదు. దీంతో రైతులు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయడంతోపాటు రాస్తారోకో, ధర్నా చేశారు. రుణమాఫీకి సంబంధించిన ముఖ్యమంత్రితోపాటు మంత్రులు పొంతనలేని ప్రకటనలు చేయడం అన్నదాతలను ఆగ్రహానికి గురి చేసింది.

### సాయంత్రం వరకు అందని సమాచారం

ఆదిలాబాద్ జిల్లాలో 90 వేల మంది రైతులకు బ్యాంకు ఖాతాలు ఉండగా.. మూడు విడుతల్లో 55 వేల మందికి రుణమాఫీ అయింది. వివిధ కారణాల వల్ల చాలా మంది రైతులు రూ.2 లక్షల రుణమాఫీకి దూరమయ్యారు. రైతుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. పలు కారణాలతో రుణమాఫీ కాలేదని తెలిపింది. రేషన్‌కార్డు లేని వారు, కుటుంబాల నిర్ధారణ కానివారు, ఆధార్ కార్డుల్లో పొరపాట్లు, బ్యాంకు ఖాతాల్లో తప్పుల వివరాలను సర్వేలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతుల ఇండ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబాలతో సెల్ఫీలు దిగి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 18 వేల మంది కుటుంబ నిర్ధారణ కానట్లు గుర్తించారు. వీరితో పాటు బ్యాంకుల్లో పొరపాట్లు, ఇతర సమస్యలు ఉన్న రైతులు మరో 10 వేలకు పైగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్‌లో శనివారం రైతు పండుగ చేపట్టారు. ఇందులో భాగంగా మిగిలిన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయనున్నట్లు ప్రకటించారు. శనివారం సాయంత్రం వరకు జిల్లాలో ఎంతమందికి రుణమాఫీ జరిగిందనే విషయం తెలియలేదు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకున్నది. ఈ సారైనా తమకు రుణమాఫీ జరుగుతుందా? అని ఆశతో ఎదురుచూస్తున్నారు.

# అంకితభావంతో పని చేయాలి..

## - నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, నవంబర్ 30 : నూతనంగా విధుల్లో చేరిన పోలీసులు అంకిత భావంతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. జిల్లా నుంచి పోలీసు శాఖకు ఎంపికైన 137 మంది కానిస్టేబుళ్లు విధుల్లో చేరారని తెలిపారు. ప్రజల రక్షణ మన బాధ్యత అని వారి హక్కులు ఆత్మగౌరవానికి భంగం కలుగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ సూర్యనారాయణ, ఏవో యూనిస్ అలీ, డీపీవో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఐ రాంనిరంజన్, రమేశ్, జ్యోతి, రవి పాల్గొన్నారు.

### నేటి నుంచి జిల్లాలో 30 పోలీస్ యాక్టు అమలు

నిర్మల్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నెలరోజులపాటు డిసెంబర్ 31 వరకు 30, 30ఏ పోలీస్ యాక్టును అమలులో ఉంటుందని ఎస్పీ జానకి షర్మిల ప్రకటనలో తెలిపారు. పోలీసుల ముందస్తు అనుమతిలేనిది ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని.. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రజా ధనానికి నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టవద్దని అన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

# ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ ప్రొగ్రాం

బాసర, నవంబర్ 30 : ఆర్‌జీయూకేటీ బాసరలో శనివారం ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ ప్రొగ్రామ్‌ను నిర్వహించారు. కొత్తగా నమోదు చేసుకున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్, ఐఐఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళి దర్శన్, నేషనల్ సర్వీస్ స్కీమ్ ఎన్ఎస్ఎస్ యొక్క లక్ష్యాలు, కార్యకలాపాలు, ప్రయోజనాలతో కొత్త ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లకు పరిచయం చేయడం ఓరియంటేషన్ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాకేశ్‌రెడ్డి, ప్రొగ్రాం ఆఫీసర్ల డాక్టర్ రమాదేవి, డాక్టర్ రాములు, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

### డ్రగ్స్ నివారణ పోస్టరు విడుదల

ఓరియంటేషన్ ప్రొగ్రాంలో భాగంగా డ్రగ్స్ నివారణ పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్క విద్యార్థి పని చేయాలని పిలుపునిచ్చారు.




డ్రగ్స్ నివారణ పోస్టరును విడుదల చేస్తున్న దృశ్యం

# సర్వేకు కరెంటు కష్టాలు

## సెల్‌ఫోన్ వెలుతురులో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ

తాంసి (తలమడుగు), నవంబర్ 30 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కోడత్ గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు కరెంటు సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ఆన్‌లైన్ చేస్తున్న సీఆర్‌పీ భాగ్యలక్ష్మి తదితర సిబ్బంది తమ సెల్‌ఫోన్ వెలుతురులోనే సర్వే వివరాలను ఆన్‌లైన్ చేశారు. దీనికితోడు సర్వర్ సమస్య కూడా తోడవడంతో సిబ్బంది చాలా ఇబ్బంది పడ్డారు.



సెల్‌ఫోన్ వెలుగులో ఆన్‌లైన్ చేస్తున్న సీఆర్‌పీ భాగ్యలక్ష్మి



లాహుజీ సాల్వే జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న

# లాహుజీ సాల్వే కృషి మరువలేనివి

ఎదులాపురం, నవంబర్ 30 : సమాజం, దేశం కోసం క్రాంతివీర్ లాహుజీ సాల్వే చేసిన కృషి మరువలేనివని, ఆయన ఆచరణలను ప్రతి ఒక్కరు అనుసరించాలని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం లాహుజీ సాల్వే చౌక్‌లో లాహుజీ సాల్వే 230వ జయంతిని నిర్వహించారు. దీనికి రామన్న ముఖ్యఅతిథిగా హాజరై సాల్వే, అన్నబావు సాఠే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. దేశంలోని అన్ని జాతులను ఐక్యం చేసిన మహనీయుడు లాహుజీ సాల్వే అని కొనియాడారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమం, అభ్యున్నతితోపాటు దేశం కోసం పోరాడారని గుర్తు చేశారు. ఇతర కులాలు, జాతులు ఆయన ఇచ్చిన సందేశాలను పాటిస్తు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో లాహుజీ శక్తి సేన రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ్ లాంటిలే, అన్నబావు సాఠే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్ మోరే, రణదివేనగర్, బంగారిగూడ అధ్యక్షుడు శ్యాంరావ్, రాజు, తెలంగాణ మతంగ్ శక్తి జిల్లా అధ్యక్షుడు జాదవ్ సాంబశివ్, ముక్తసాల్వే జిల్లా అధ్యక్షుడు రాజుకుమార్, పండరి సూర్యవంశీ, దత్తరాజ్ దేవ్ కాంబ్లే పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, నవంబర్ 30 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడాల్లో రాణించాలని, ఆ దిశగా వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ వసతి గృహ విద్యార్థుల జిల్లాస్థాయి క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం ఇందిర ప్రియదర్శిని స్టేడియంలో క్రీడా పోటీలకు అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ.. జట్ల మధ్య టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ కూడా వాలీబాల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. త్వరలో వంట మనిషితోపాటు నర్సు, ఉపాధ్యాయులకు ఆహార భద్రత అధికారులతో శిక్షణలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి కె.రాజలింగు, డీవైఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.